ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పొరుగు రాష్ట్రాల నుంచి మామిడి దిగుమతి కాకుండా నిఘా

● కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గుజ్జు ఫ్యాక్టరీలకు సరిహద్దుల్లో వున్న తమిళనాడు, కర్ణాటక లనుంచీ మామిడి సరఫరా కాకుండా చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా పెంచాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ విద్యాధరితో కలిసి రెవిన్యూ, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు.మండల లనే అంశంపై రైతాంగానికి పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విషయంలో క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యానశాఖ అసిస్టెంట్లు విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఏరోజుకారోజు ఎన్ని టన్నుల కోత కోయాలనే విషయంపై పూర్తి అవగాహన ఉంటేనే ప్రాసెసింగ్ కంపెనీలకు అధికారులు పల్ప్‌కు తరలించే విషయంపై అవగాహన ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం స్థాయిలో తహసీల్దార్, వ్యవసాయశాఖ అధికారి, ఉద్యానశాఖ అధికారి మామిడి గుజ్జు ఫ్యాక్టరీల వద్ద రోజుకు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా మూడు బృందాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో పాటు రోజుకోసారి ఫ్యాక్టరీల వద్దకు వెళ్ళి వాస్తవ పరిస్థితులను అంచనా వేయాలన్నారు. ఫ్యాక్టరీలకు తోతాపురి రకం మామిడిని అందిస్తున్న రైతుల ఆధార్, బ్యాంకు ఖాతా, ఫోన్ నెంబర్ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కత్తిరించి మామిడి గుజ్జు ఫ్యాక్టరీలకు తరలించా మద్దతు ధర ప్రకటించిన నేపథ్యంలో నెల రోజుల పాటు రెవిన్యూ, ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు లబ్ధి చేకూర్చాలని ఆదేశించారు. ర్యాంపులు, మండీల్లో సరైన తూకాలను పర్యవేక్షించాలని తూనికలు కొలతలశాఖ అధికారి ఏడీ స్వామిని కలెక్టర్ సూచించారు.వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, మూడు జిల్లాల ఉద్యానశాఖ అధికారులు మధుసూదన రెడ్డి, దశరథరామిరెడ్డి, రవిచంద్రబాబు, డీఎస్వో శంకరన్,మార్కెటింగ్‌శాఖ ఏడీ పరమేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు థ్యాంక్స్ :టీడీపీ

చిత్తూరు సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడికి టీడీపీ ధన్యవాదాలు తెలిపింది.టీడీపీ నేతలు దొరబాబు,చంద్రప్రకాష్, కోదండ యాదవ్, మోహన్‌రాజ్, సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్ తదితరులు శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇందుకు సహకరించిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు గిట్టుబాటు ధర నిర్ణయించిన క్రమంలో ఫ్యాక్టరీలు మోసం చేయాలని చూస్తే యాజమాన్యాలపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే జగన్మోహన్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులోని మామిడికాయల మండీలను టీడీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.మద్దతు ధర జీవో రాగానే గుజ్జు ఫ్యాక్టరీలను పరిశీలిస్తామని, ఎక్కడైనా ఫ్యాక్టరీ యజమానులు రైతులకు అన్యాయం చేసినట్లు తెలిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. రైతులకు నష్టం చేయాలని చూసే బ్రోకర్లపై కూడా చర్యలు తప్పవన్నారు.



టీడీపీ నేతలతో కలసి మామిడి మండీలో కాయల నాణ్యత చూస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

మామిడి రైతులకు మద్దతు



- ● కిలోకు రూ.4 సబ్సిడీ ప్రకటించిన ప్రభుత్వం
- ● రూ.12కు తగ్గకుండా అమలుకు చర్యలు
- ● రూ.200 కోట్ల వరకు రైతులకు సాయం
- ● ఇక ఊపందుకోనున్న మామిడి కోతలు
- ● మద్దతు ధర పటిష్ఠ అమలుకు కలెక్టర్ ప్రణాళిక
- ● 2018లోనూ ఇలాగే రైతులను ఆదుకున్న టీడీపీ సర్కారు

చిత్తూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు జిల్లాలోని మామిడి రైతులను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోగా.. ఆ పార్టీ నాయకులు ఫ్యాక్టరీ యజమానుల, వ్యాపారుల సిండికేట్లకు మద్దతు పలికి రైతులకు తీవ్ర నష్టం కలిగేలా చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రైతుల ఆశలు చిగురించాయి. జిల్లా రైతులు సీఎం చంద్రబాబు మీద నమ్మకాన్ని పెంచుకున్నారు. అనుకున్నట్లే తోతాపురి మామిడి కిలోకు రూ.4 సబ్సిడీని ప్రభుత్వం ప్రకటించింది. ఫ్యాక్టరీల వద్ద , ర్యాంపుల వద్ద మద్దతు ధరను పటిష్ఠంగా అమలు చేసేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 99,738 ఎకరాల్లో తోతాపురి మామిడి రకం సాగులో ఉంది. ఈసారి దిగుబడి బాగుండడంతో 4,98,350 టన్నుల దిగుబడి ఉంటుందని అంచనా వేస్తున్నారు. సాధారణ పరిస్థితుల్లో ఈ దిగుబడి 4 లక్షల టన్నుల్లో ఉంటుంది. ప్రభుత్వం కిలోకు రూ.4 ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటిస్తుండగా.. సుమారు రూ.200 కోట్ల వరకు రైతులకు అందించాల్సి వస్తుంది. రైతులకు సబ్సిడీ అందిస్తే రూ.155 కోట్ల వరకు ఖర్చవుతుందని ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది.

రేపటి నుంచి ప్రత్యేక కార్యాచరణ

ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద రెవెన్యూ, అగ్రికల్చర్, హార్టికల్చర్ శాఖలకు చెందిన ఉద్యోగులు ఆదివారం నుంచి షిఫ్టులుగా పని చేయనున్నారు. ఇలా సుమారు 150 మంది ఉద్యోగుల్ని ఎంపిక చేశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి మామిడి కాయలు రాకుండా ఆయా చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచనున్నారు.

● ఫ్యాక్టరీల వద్ద మద్దతు ధర పక్కానే

జిల్లాలో 35 ఫ్యాక్టరీలు, 38 ర్యాంపులు ఉన్నాయి. తోతాపురి రకం కోతలు పూర్తిస్థాయిలో ప్రారంభించకపోవడంతో ఫ్యాక్టరీలు కూడా పూర్తి స్థాయిలో తెరచుకోలేదు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇప్పటికే పలుమార్లు ఫ్యాక్టరీ యాజమాన్యాలతో సమావేశమవ్వగా.. వారిలో కొందరు రూ.7.. మరికొందరు రూ.7.50 ఇస్తామని అంగీకరించారు. రూ.12 ను పటిష్ఠంగా అమలు చేసేందుకు సహకరించాలని, ఫ్యాక్టరీల తరపున రూ.8 ఇవ్వాలని, ప్రభుత్వం రూ.4 ఇస్తుందని కలెక్టర్ సూచించారు. ఈ లెక్కన ఫ్యాక్టరీల వద్ద రూ.12 అనేది అమలయ్యే అవకాశాలున్నాయి.అయితే ర్యాంపుల వద్ద మద్దతు ధర అమలయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ర్యాంకుల వద్ద మధ్యవర్తులు ఉంటారు. వారితో రైతులకు సంబంధాలుంటాయి. మధ్యవర్తుల నుంచి అడ్వాన్సులను తీసుకుని రైతులు పంట కోసుకుని తెస్తారు. తూకం వేసిన తర్వాత వెంటనే నగదు ఇచ్చేస్తారు. ఫ్యాక్టరీలు ఆలస్యంగా బిల్లుల్ని మంజూరు చేస్తాయి. దీంతో కొందరు రైతులు ర్యాంపుల్ని ఆశ్రయిస్తారు. అక్కడ మాత్రం మద్దతు ధర అమలవడం కష్టతరం. అయినా, కిలోపై రూపాయికి మించిన వ్యత్యాసం ఉండకూడదని కలెక్టర్ ఆదేశించారు.

● సీఎం ప్రత్యేక దృష్టి సారించి..

సీఎం చంద్రబాబుకు జిల్లా పరిస్థితులపై, ఇక్కడి మామిడి రైతుల కష్టాలపై పూర్తి అవగాహన ఉంది. 2018లో రైతులకు రూ.2.5 సబ్సిడీ ఇచ్చిన ఆయన, ఇప్పుడు కూడా రైతుల కష్టాలు తెలుసుకుని రూ.4 సబ్సిడీ ధర ఇచ్చేందుకు అంగీకరించారు. సీఎంవో అధికారులతో జిల్లా మామిడి రైతుల పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు తెలుసుకున్న చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు.2018లో పంట దిగుబడి అధికంగా వచ్చేసింది. ధర విషయంలో మామిడి రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. అప్పట్లో కలెక్టర్ ప్రద్యుమ్న చొరవ తీసుకుని సీఎం చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. కిలోకు రూ.2.50 చొప్పున రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ అందించింది.

● కోతలు నెమ్మదిగా చేసుకుంటే మంచి ఫలితం

ప్రస్తుతం ధరలు అనుకూలంగా లేవని రైతులు తోతాపురి కాయల కోతల్ని ఇంకా ప్రారంభించలేదు. ఇప్పుడు ప్రభుత్వం మద్దతు ధర, సబ్సిడీ ప్రకటించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ధరల్ని ఇలాగే స్థిరంగా అమలు చేయనున్నారు.రైతులు కూడా ఒక్కసారిగా కాకుండా నెమ్మదిగా కోతలు చేసుకుంటే మంచి ఫలితాన్ని పొందొచ్చు.

● గత ఐదేళ్లూ ఏం జరిగిందంటే..

2018లో ధరలు పతనమైతే టీడీపీ ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చింది. 2019లో అకాల వర్షాలతో వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు. 2020, 2021లో కరోనా కారణంగా మామిడి ఎగుమతులు లేవు. 2022లో దిగుబడి లేకుండా పోయింది. 2023లో దిగుబడి బాగా వచ్చినా, ఫ్యాక్టరీలు సిండికేట్‌గా మారి రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వలేదు. వైసీపీ పాలనలో మద్దతు ధర ఇప్పించి ఆదుకోవాలని ప్రతిపక్షాలు, రైతు సంఘ నాయకులు ఆందోళనలు చేసినా పట్టించుకున్న వారు లేరు. అధికారులకు వినతిపత్రాలను ఇచ్చేవారు. 2023లో అప్పటి టీడీపీ ఇన్‌చార్జి, ప్రస్తుత ఎమ్మెల్యే మురళీమోహన్ బంగారుపాళ్యం హైవే మీద పెద్దఎత్తున ధర్నా కూడా చేశారు. పెద్దిరెడ్డి కుటుంబానికి చెందిన గుజ్జు పరిశ్రమ పీఎల్ఆర్ ఫుడ్స్ సదుంలో ఉంది. పెద్దిరెడ్డి అండతోనే వ్యాపారులు ధరలను తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపించేవారు. అప్పట్లో కలెక్టర్ షన్మోహన్ ఫ్యాక్టరీల యజమాన్యాలతో సమావేశమై తొలిసారి టన్ను రూ.19 వేలు, మరోసారి రూ.15,500గా మద్దతు ధరను ప్రకటించారు. ఈ ధరల అమలుపై క్షేత్రస్థాయిలో అధికారులెవ్వరూ దృష్టి పెట్టలేదు. వెనుక వైసీపీ పెద్దలు ఉండడంతో మద్దతు ధర అమలుకాకున్నా రైతుల పక్షాన ప్రశ్నించే ప్రజాప్రతినిధులు, అధికారులు లేకుండా పోయారు.

హరియాణా ముఠా కటికెనహళ్లికి చేరినట్టేనా!

ఆచూకీ దొరకని దోపిడీదారులు ● పోలీసుల అదుపులో వున్న నిందితుడి ఇంటరాగేషన్ పూర్తి

కుప్పం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో చొరబడి పోలీసుల ఫైరింగ్‌కు కూడా కారణమై తప్పించుకున్న హరియాణా దోపిడీ దొంగల ముఠా ఆచూకీ ఇంకా దొరకలేదు. కుప్పం నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న అనేక రహస్య మార్గాలను వినియోగించుకుని కర్ణాటక రాష్ట్రంలో దోపిడీదారుల గ్రామమైన కటికెనహళ్లికి చేరిపోయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే తమ అదుపులో ఉన్న దోపిడీ ముఠా సభ్యుడు ఒకరిని మాత్రం పోలీసులు రేపు అరెస్టు చూపించే అవకాశం ఉంది.

కుప్పం-కృష్ణగిరి మార్గంలో కుప్పం వ్యవసాయ మార్కెట్టు వద్ద ఈనెల 3వ తేదీ రాత్రి ఐదుగురు సభ్యులతో కూడిన హరియాణా ముఠా ప్రయాణిస్తున్న వాహనాన్ని పోలీసులు ఆపడానికి ప్రయత్నించే క్రమంలో జరిగిన ఘటన తెలిసిందే. ఎస్ఐని తొక్కించబోయిన వాహనంపై కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్ ఒక రౌండ్ కాల్పులు జరపడం, డ్రైవర్ గాయపడినా సరే, లోపలున్నవారు ఏమాత్రం వెరవకుండా వేగంగా ప్రయాణించి పరమసముద్రం చెరువు వద్ద స్కార్పియో వాహనాన్ని వదిలిపెట్టి పరారయ్యారు. ఇకప్పటినుంచీ డీఎస్పీ పార్థసారథి ఆధ్వర్యంలో రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్, అర్బన్ సీఐ శంకర్‌ల తోపాటు ఎస్ఐలు, సిబ్బంది మొత్తం తప్పించుకుపోయిన దోపిడీ ముఠాకోసం కుప్పం పరిసరాలను జల్లెడ పట్టారు. ఈ క్రమంలో స్థానిక రైల్వే స్టేషన్ వద్ద రైలుకోసం వేచి చూస్తున్న ముఠాలోని సభ్యుడు 4వ తేదీ రాత్రి పోలీసులకు చిక్కారు. సీఐ మల్లేశ్ యాదవ్ జరిపిన కాల్పుల్లో హరియాణా ముఠా ప్రయాణిస్తున్న కారు డ్రైవర్ గాయపడ్డాడు. అయినా సరే, ఆ ముఠా ఆచూకీ తెలియకుండా పోయిందంటే వారు తమకు ఎప్పటినుంచో పరిచయమైన రహస్య మార్గాల ద్వారా కుప్పం పరిసరాలనుంచి పరారై ఉంటారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని కరడు గట్టిన నేరస్తులు, దోపిడీదారుల అడ్డా అయిన కటికెనహళ్లికి ఆ ముఠా సభ్యులు ఈసరికే చేరిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ఈ ముఠా సభ్యులపై నాలుగు కేసులు పెండింగులో ఉన్నాయి. అంతేకాదు.. ఆంధ్రా-కర్ణాటక మధ్య కుప్పం మీదుగా హరియాణా ముఠా రాకపోకలు సాగిస్తుంటుందన్న సమాచారం పోలీసుల వద్ద ఉంది. ఈ క్రమంలో ఈ ముఠా సభ్యులు సుమారు 30మందికి కటికెనహళ్లి దోపిడీదారులతో సంబంధాలున్నాయని అంటున్నారు. పశువుల దొంగతనాలు మొదలు, బ్యాంకు దోపిడీల దాకా సాగించే హరియాణా ముఠా, కటికెనహళ్లి దోపిడీదారుల సాయం తీసుకుంటూ ఉంటుందని పోలీసుల వద్ద ప్రాథమిక సమాచారముంది. ఇప్పుడు కూడా ఈ సంబంధాలను ఉపయోగించుకునే హరియాణా ముఠా పోలీసుల వేటనుంచి చాకచక్యంగా తప్పించుకుని కటికెనహళ్లి చేరిపోయి ఉంటుందన్న అనుమానాన్ని పోలీసులు వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. కటికెనహళ్లి దోపిడీదారులు కరడుగట్టిన నేరస్తులని, ఆ గ్రామంలో అడుగుపెట్టిన వేరే వ్యక్తులెవరినీ ప్రాణాలతో బయటకు పోనీయరని ప్రతీతి. కర్ణాటక రాష్ట్ర పోలీసులు కూడా ఈ గ్రామం హద్దు దాటి లోపలికి వెళ్లాలంటే జంకుతారని ఆ పోలీసులే చెబుతుంటారు. ఈ నేపథ్యంలో ఇక ఇప్పట్లో హరియాణా ముఠా ఆచూకీ కనిపెట్టి, అరెస్టు చేయడం కష్టసాధ్యమేనన్న అభిప్రాయం పోలీసు వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.



హరియాణా ముఠా వేటలో థర్మో డ్రోన్‌ను వినియోగిస్తున్న పోలీసులు

నేడు అరెస్టు చూపించే అవకాశం

హరియాణా దోపిడీదారుల ముఠాలోని నలుగురు సభ్యులు తప్పించుకున్నా, ఒక వ్యక్తి మాత్రం పోలీసుల అదుపులో ఉన్నారు. ఒక రహస్య ప్రదేశంలో ఉంచి అతడిని ఇంటరాగేట్ చేస్తున్నట్లు సమాచారం. శుక్రవారం సాయంత్రానికి ఇంటరాగేషన్ పూర్తయినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అతడిని పోలీసులు శనివారం అరెస్టు చూపించి, కోర్టుకు హాజరుపరిచే అవకాశం ఉంది. దీనిపై కుప్పం డీఎస్పీ పార్థసారధిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా హరియాణా ముఠా కర్ణాటక రాష్ట్రానికి పరారైనట్లు అనుమానిస్తున్నామని తెలిపారు. ఆ ముఠా ఆచూకీ కనిపెట్టి అరెస్టు చేయడంలో కర్ణాటక రాష్ట్ర పోలీసుల సహకారం తీసుకుంటామని చెప్పుకొచ్చారు.

సాంఘిక సంక్షేమశాఖ డీడీగా విక్రమ్‌కుమార్‌రెడ్డి

చిత్తూరు అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా జె.విక్రమ్ కుమార్ రెడ్డి నియమితులయ్యారు. ఈయన రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తుండగా, తాజా బదిలీల్లో భాగంగా మన జిల్లాకు డీడీగా నియమించారు. దీంతోపాటు తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలూ కేటాయించారు. ఇక్కడ డీడీగా ఉన్న చెన్నయ్యను గుంటూరు సాంఘిక సంక్షేమశాఖ డీడీగా బదిలీ చేసింది.

ముగిసిన ఎస్జీటీల పదోన్నతి కౌన్సెలింగ్

చిత్తూరు సెంట్రల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీల) పదోన్నతి కౌన్సెలింగ్ శుక్రవారం ముగిసింది. స్థానిక డీఈవో కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఈవో వరలక్ష్మి అధ్యక్షతన ఈ ప్రక్రియ సాగింది. ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతికి 273 ఖాళీలను విద్యాశాఖ అధికారులు గుర్తించారు. వీటిల్లో.. జడ్పీ యాజమాన్యంలో 106, ప్రభుత్వ యాజమాన్యంలో ఒకటి, మున్సిపల్ కార్పొరేషన్‌లో 54, మున్సిపాలిటీ యాజమాన్యం పాఠశాలల్లో 112 ఖాళీలు ఉన్నాయి. ఇందుకోసం 1:3 రేషియోలో 819 ఎస్జీటీలను కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సీనియారిటీ జాబితా ఆధారంగా ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. రాత్రి వరకు కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులు చేపట్టారు. శనివారం నుంచి సీనియారిటీ జాబితా ఆధారంగా ఎస్జీటీలకు బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది.



ఎస్జీటీల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ప్రారంభమైన డీఎస్సీ పరీక్షలు

103 మంది అభ్యర్థుల గైర్హాజరు



సీటెక్స్ పరీక్ష కేంద్రం వద్ద నోటీసు బోర్డులో నెంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షలు జిల్లాలోని నాలుగు, చెన్నైలోని సెంటర్లలో శుక్రవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో మొత్తం 859 మంది అభ్యర్థులకు 756 మంది హాజరవగా, 103 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఉదయం సెషన్‌లో 529 మందికి 461 మంది హాజరవగా, 68 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 330 మందికి 295 మంది హాజరవగా 35 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష సమయానికి గంటన్నర ముందే అభ్యర్థులను తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతించారు. ఈనెల 30వ తేదీ వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి.

11వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 502 రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ శుక్రవారానికి మూడో రోజుకు చేరింది. ఇప్పటి వరకు 28,592 మంది రైతులకు 11,060 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు.

వచ్చే వారం నుంచి పొలం బడి

చిత్తూరు సెంట్రల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తున్న క్రమంలో వచ్చే వారం నుంచి 14 వారాల పాటు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం బడి' కార్యక్రమం నిర్వహించనున్నారు. మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని రైతులకు వివిధ రకాల పంటల సాగు, భూసార పరీక్షల ఆధారంగా వాడాల్సిన ఎరువులు, సేంద్రియ సాగుపై అవగాహన కల్పించనున్నారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖాధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

పశ్చిమ డీఆర్వో ఆనంద్‌రెడ్డి సస్పెన్షన్

చిత్తూరు సెంట్రల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ పశ్చిమ విభాగం డీఆర్వో (డిప్యూటీ రేంజ్ అధికారి) ఆనంద్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ సీఎఫ్ (కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు) యశోదబాయి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. పశ్చిమ రేంజ్ కార్యాలయంలో శ్రీగంధం డిపో (గోడౌన్) ఉంది. ఈ గోడౌన్ ఇన్‌చార్జి బాధ్యతలను కూడా డీఆర్వోనే చూసుకోవాలి. రాష్ట్రంలో పట్టుబడిన శ్రీగంధాన్ని ఇక్కడ నిల్వ చేస్తారు. అయితే గోడౌన్ నిర్వహణలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించేవారు. ఈ క్రమంలోనే డీఎఫ్‌వో భరణి పరిశీలనకు వస్తున్నట్లు తెలియడంతో ముందు రోజు గోడౌన్ శుభ్రం చేయడానికి డీఆర్వో వెళ్లారు. అక్కడ 10 లీటర్ల శ్రీగంధం నూనె క్యాన్ పేలి, వృథా అయినట్లు గమనించారు. ఈ విషయం డీఎఫ్‌వోకు తెలియడంతో గోడౌన్‌ను పరిశీలించి, ఘటనపై లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని కోరారు.ఈ సంఘటనపై స్క్వాడ్ డీఎఫ్‌వో గురుప్రభాకర్, సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్‌ను విచారణాధికారులుగా నియమించారు. వారు విచారణ నివేదికను డీఎఫ్‌వో ద్వారా సీఎఫ్‌కు పంపారు. గోడౌన్ ఇన్‌చార్జిగా విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వంగా వ్యవహరించారనే ఆరోపణ, నూనె వృథా కావడంపై ఆనంద్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.





నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి - విజయదుర్గ

శ్రీవారి సేవలో మాజీ సీఎం నల్లారి

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మెగాస్టార్ చిరంజీవి సోదరి, నటుడు సాయిధరమ్‌తేజ్ తల్లి విజయదుర్గ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా దర్శనానికి ముందు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సుప్రభాత సేవలో విజయేంద్ర సరస్వతి



కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మఠం ఉత్తరాధికారి సత్యచంద్రశేఖరేంద్ర సరస్వతితో కలిసి శ్రీవారి ఆలయంలో వేకువజాము జరిగిన సుప్రభాతసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం తర్వాత శ్రీవారి పుష్కరిణిని సందర్శించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, జూన్6(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ సర్కిల్ ఉంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.34 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,284

తలనీలాలు సమర్పించినవారు: 31,268



రేపటి నుంచి యూపీఎస్సీ ఇంజనీరింగ్ పరీక్షలు



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్షలు(ప్రిలిమనరీ) ఆదివారం నుంచి నిర్వహించనుండడంతో డీఆర్వో నరసింహులు శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. నగరంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో 791మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అందుకు తగినట్లు కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. పేపర్ 1 ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, పేపర్ 2 మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయని, అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపుకార్డు తెచ్చుకోవాలని అన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు.

తిరుపతిలో మత్తు ఇంజెక్షన్ల కలకలం

- ఆగమేఘాల మీద ఘటనా స్థలం పరిశీలన
- అంతా ఫేక్ అని తేల్చిన పోలీసులు



కూరాయల మార్కెట్‌లో వ్యాపారులు, కొనుగోలుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేర విభాగం), జూన్ 6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం మత్తు ఇంజెక్షన్లు వున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలతో కలకలం రేగింది. దీనిపై ఎస్పీ హర్షవర్ధనరాజు సీరియస్‌గా స్పందించారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, ఎస్బీ సీఐ షాదిక్ ఆలీ, పోలీసులతో కలసి ఘటనా స్థలానికి వచ్చి చుట్టు పక్కల ప్రాంతాలు, మత్తు ఇంజెక్షన్లు వున్నట్లు వచ్చిన ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించారు. దాదాపు 40 నిమిషాల పాటు అక్కడే ఉండి కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులు, కొనుగోలుదారులతో మాట్లాడారు. ఎవరికైనా మత్తు ఇంజెక్షన్లు కనపడ్డాయా? ఎవరనా చూశారా అని అడిగారు. అయితే వైరల్ అయిన వీడియోను పరిశీలించిన ఎస్పీ అది ఇప్పటిది కాదని తేల్చారు. కానీ భవిష్యత్తులో కూరగాయల మార్కెట్‌లో నిషేధిత వస్తువులు, మత్తు ఇంజెక్షన్లు, మాదక ద్రవ్యాల ఉనికి కనపడకుండా ఉండడానికి వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ పటిష్ఠమైన గస్తీ ఏర్పాటు చేయాలని డీఎస్పీని ఆదేశించారు. ఎక్కడైనా ఇలాంటి ఘటనలు ప్రజల దృష్టికి వస్తే వెంటనే 112 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ జరుపుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6(ఆంధ్రజ్యోతి): బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ జిల్లా అధికారులు ఆకాంక్షించారు. శనివారం బక్రీద్‌ను పురస్కరించుకుని వారు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

భూదేవి కాంప్లెక్స్‌లో దివ్యదర్శన టోకెన్ల జారీ



దివ్యదర్శనం టోకెన్లు పొందుతున్న శ్రీవారి మెట్టు కాలిబాట భక్తులు

తిరుమల, జూన్6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన వెళ్లే భక్తులకు శుక్రవారం సాయంత్రం నుంచి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్‌లో దివ్యదర్శన(డీడీ) టోకెన్ల జారీని టీటీడీ ప్రారంభించింది. ఈసందర్భంగా టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారిమెట్టు దివ్యదర్శన టోకెన్ కేంద్రాన్ని శ్రీవారిమెట్టు నుంచి భూదేవి కాంప్లెక్స్‌కు మార్చడంపై భక్తుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. శ్రీనివాస మంగాపురం ఆలయంలో కౌంటర్ల ఏర్పాటుకు భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతున్న క్రమంలో భక్తుల సౌకర్యార్థం టోకెన్ కౌంటర్లను తాత్కాలికంగా భూదేవి కాంప్లెక్స్‌కు మార్చామన్నారు. భూదేవి కాంప్లెక్స్‌లో ఇప్పటికే పూర్తిస్థాయిలో ఎస్ఎస్‌డీ(స్లాటెడ్ సర్వదర్శనం) టోకెన్లు జారీ చేసే మౌలిక సదుపాయాలు ఉండటంతో డీడీ టోకెన్ల జారీని ప్రారంభించామన్నారు. శ్రీవారిమెట్టు డీడీ టోకెన్ల జారీ చేయడానికి నాలుగు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని, టీటీడీ ఏర్పాట్లపై భక్తులు కూడా ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. రవాణా వ్యవస్థ కూడా బాగా ఉందని, బస్టాండ్ కూడా అలిపిరిలోనే ఉందన్నారు. దీంతో భక్తులు శ్రీవారిమెట్టుకు చేరుకోవడానికి సౌకర్యంగా ఉంటుందన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు శ్రీవారి సేవా వలంటీర్లతో పాటు పరిపాలన నిఘా, అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించామన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా డీడీ టోకెన్లు జారీ చేసేందుకు టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేసిందన్నారు. ఈకార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యదర్శన టోకెన్లను పరిశీలిస్తున్న అదనపు ఈవో

చెవిరెడ్డీ.. లిక్కర్ స్కామ్‌లో నీ పాత్ర ఏంటో

సిట్ దర్యాప్తులో తేలుతుంది

- వ్యవస్థలను బ్లాక్‌మెయిల్ చేయడం నీ నైజం
- కక్ష సాధింపు కాదు.. మీ అవినీతిపై చట్టపరంగానే చర్యలు
- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న పులివర్తి నాని

తిరుపతి(జీవకోన), జూన్ 6(ఆంధ్రజ్యోతి): చెవిరెడ్డీ.. లిక్కర్ స్కామ్‌లో నీ పాత్ర ఏంటో సిట్ దర్యాప్తులో తేలుతుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. నీ గన్‌మేన్ గిరిని బెదిరించి తప్పుడు స్టేట్‌మెంట్లు ఇవ్వమన్నారంటూ హడావిడి చేయడం.. గుమ్మడికాయల దొంగ భుజాలు తడుముకున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. సానుభూతి, పబ్లిసిటీ కోసం ముందస్తుగానే ఇలాంటివి చేయడం సరికాదన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కసిరెడ్డితో స్నేహం లేకపోతే టీటీడీ బోర్డుకు ఆయన పేరు ఎందుకు సిఫార్సు చేశావంటూ ప్రశ్నించారు. 'నీపై 87కేసులు పెట్టారంటూ చెబుతున్నావు. అవన్నీ టీడీపీ ప్రభుత్వంలో కాదు.. కాంగ్రెస్ హయాంలో పెట్టినవే. వైసీపీ ప్రభుత్వంలో నాపై ఎన్నో కేసులు పెట్టారు. మేము తప్పు చేస్తే ఏ జైలుకైనా వెళ్లడానికి సిద్ధం. వ్యవస్థలను బ్లాక్‌మెయిల్ చేసే నైజం నీది. ఈ ప్రభుత్వంలో ఎవరిపైనా కక్షసాధింపులు ఉండవు. మీ అవినీతికి సంబంధించిన ఆధారాలు చాలా ఉన్నాయి. అవన్నీ చట్టం చూసుకుంటుంది. ఇకనైనా బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకో. నువ్వు తప్పు చేయలేదంటే ఎవరూ నిన్ను టచ్ చేయరు. నువ్వెంత అవినీతి చేశారో అందరికీ తెలుసు. అరెస్టయితే సింపతీ వస్తుందని అనుకుంటున్నావేమో? అలాంటి పరిస్థితి ఉండదు' అని పులివర్తి నాని స్పష్టం చేశారు. బియ్యం మాఫియాలో మీ కుటుంబానికి ఎంత ముడుపులు చేరాయో త్వరలోనే బయటకు వస్తుందని చెవిరెడ్డిని ఉద్దేశించి అన్నారు. ఎన్నికల సమయంలో కంటైనర్లలో డబ్బులు దొరికిన విషయాన్ని గుర్తు చేశారు.ఆ డబ్బులు తమవి కాదంటూ చెవిరెడ్డి బుకాయిస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవద్దని, అవసరమైతే సలహాలు ఇవ్వాలని సూచించారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏడాది కాలంలో తాను ఎన్నో అభివృద్ధి పనులు చేపడితే.. చేయలేదంటూ పత్రికల్లో రాయించడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.80కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేశానని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు ఈశ్వర్‌రెడ్డి, గౌస్ బాషా, మురళి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మాఫియాలో నన్ను ఇరికించే కుట్ర

- తప్పుడు వాంగ్మూలం కోసం సిట్ ఒత్తిడి తెస్తోందన్న చెవిరెడ్డి



తిరుపతి రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాంలో తనను ఇరికించేందుకు కుట్ర చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆరోపించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాదులో నివాసమున్న తన ఆత్మీయుడు వెంకటేష్, ఆయన భార్య, ఏడాది వయసున్న కుమారుడిని సిట్ అధికారులు తమ కార్యాలయంలో బంధించి భయపెడుతున్నారని ఆరోపించారు. సిట్ తయారు చేసిన తప్పుడు స్టేట్‌మెంట్‌లో సంతకం పెట్టకుంటే ఏదో ఒక కేసులో ఇరికించి జీవితాంతం జైల్లో ఉండేలా చేస్తానంటూ వెంకటేష్‌ని ఏఎస్పీ శ్రీనివాస్ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. అప్పటికీ ఆయన సంతకం పెట్టకపోవడంతో ప్రలోభపెడుతున్నట్టు ఆరోపించారు. వెంకటేష్ కుటుంబీకులతో పాటు ఆయనవద్ద పనిచేసే చిన్న చిన్న ఉద్యోగులనూ తీసుకెళ్లి హింసిస్తున్నారన్నారు.

వైభవం.. గోవిందుడి గరుడోత్సవం



గరుడ వాహనంపై ఊరేగుతున్న గోవిందుడు







తిరుమల ఆలయం నుంచి తీసుకొచ్చిన ఆభరణాలు - పల్లకి వాహనం

తిరుపతి అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదో రోజైన శుక్రవారం రాత్రి గరుడసేవ జరిగింది. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన గరుడసేవ 10 గంటల వరకు కొనసాగింది. వజ్ర, వైఢూర్యాలు, విలువైన బంగారు ఆభరణాలు, సహస్రకాసుల హారాలు, నూతనంగా అందజేసిన నగలతో స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించారు. గోవిందనామ స్మరణలతో అడుగడుగున భక్తజనం కర్పూర నీరాజనం సమర్పించారు. ఉదయం మోహినీ అవతారంలో స్వామివారు భక్తులను మురిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. వాహన సేవల ముందు కోలాటాలు, చెక్కభజనలు, కేరళ్రాడ్రమ్స్, కళాబృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గరుడసేవ సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం నుంచి రూ.34.46లక్షల విలువచేసే మూడు బంగారు ఆభరణాలను కానుకగా అందించారు. దీర్ఘచతుర ప్రాకార పతకం, అమ్మవార్ల దీర్ఘచతుర ప్రాకార రెండు పతకాలను శాశ్వత ప్రాతిపదికన టీటీడీ బహూకరించింది. తిరుమల బేడిఆంజనేయస్వామి ఆలయం నుంచి ఈ ఆభరణాలను ఊరేగింపుగా డిప్యూటీ ఈవో లోకనాథం తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి తీసుకొచ్చారు.ఈ కార్యక్రమంలో జియ్యంగార్లు, అధికారులు పాల్గొన్నారు.

హెచ్చరికా.. మాకేంటి?

- బోర్డు పీకేసి భూమిని కొట్టేసేందుకు భారీ స్కెచ్

'ఈ భూమి కొత్తపాలెం రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నెంబరు-99లో ఉంది. ఇది ప్రభుత్వ భూమి. ఇందులోకి ప్రవేశించుట నిషిద్ధం. అట్లు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- రేణిగుంట తహసీల్దారు పేరిట ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఇది. దీనిని పీకి పడేసి ఆక్రమణకు యత్నిస్తున్నారు.



పాత విమానాశ్రయం రోడ్డులో కబ్జాకు యత్నిస్తున్న భూమి





ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్ నిర్మించేందుకు తోలిన రాయి - రెవెన్యూ హెచ్చరిక బోర్డును పడేసిన దృశ్యం

రేణిగుంట మండలం పాత విమానాశ్రయం ఆనుకొని ఆరు లేన్ల జాతీయ రహదారి రావడంతో రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కళ్లు పడింది. దీంతో కోట్ల విలువైన ఆ భూములను ఆక్రమించేందుకు రెండు వర్గాలు దిగాయి. ఒక వర్గం ఆ భూమి తమదంటే, కడప జిల్లాకు చెందిన మరో వర్గం తమదంటున్నాయి. తమకంటే తమకు డాక్యుమెంట్లు ఉన్నాయని చెబుతున్నారు. ఆలస్యంగా మేలుకున్న రెవెన్యూ అధికారులు సదరు భూమిలో హెచ్చరికలు బోర్డు పెట్టారు. అయితే కొత్తపాళేనికి చెందిన వ్యక్తి ఐదు ఎకరాల భూమిలో సాగు చేసుకుంటామని గతంలో అసిస్టెంట్ సెటిల్మెంట్ ఆఫీసర్ దగ్గర దరఖాస్తు చేసుకున్నారు. విమానాశ్రయం సమీపంలో ఉండడంతో దరఖాస్తును రద్దు చేశారు. దీంతో ఈ భూమిలో సాగు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్, ఆర్డీవో సహా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనుమతులు ఇవ్వలేదు. ఈ భూమి వద్దకు రోజుకు ఒకరు వచ్చి పోతుండడంతో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సురేష్‌బాబుని వివరణ కోరగా ప్రభుత్వ భూమిని శుభ్రం చేయడంతో మూడుసార్లు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. అయితే మూడుసార్లూ దాన్ని తొలగించారన్నారు. ఇకపై ఎవరైనా భూమిలో ప్రవేశిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

పారిశ్రామిక అవసరాలకు స్టాండ్‌రీచ్ ప్యానల్స్

- ఈ ప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ట్ పరిశ్రమ సీఈవో సంజాయ్ సింగానియా



రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న పరిశ్రమ సీఈవో సంజాయ్ సింగానియా తదితరులు

తడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక మౌలిక సదుపాయాలకు అవసరమయ్యే స్టాండ్‌రీచ్ ప్యానల్స్‌ను తయారు చేస్తున్నామని ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఎండీ, సీఈవో సంజాయ్ సింగానియా అన్నారు. తడ మండలం మాంబట్టు సెజ్‌లో సుమారు రూ.300 కోట్లతో ఏర్పాటు చేసిన ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ లిమిటెడ్ పరిశ్రమను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక ఫుడ్ ప్రాసెసింగ్ కోల్డ్ స్టోరేజ్ వంటి వాటికి అవసరమైన స్టాండ్‌రీచ్ ప్యానల్స్ పెరుగుతున్న డిమాండ్‌కు తమ పరిశ్రమ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. తమ పరిశ్రమ ద్వారా ఏడాదికి 8 లక్షల చదరపు మీటర్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉందని దానిని 13.10 లక్షల చదరపు మీటర్లకు చేర్చేలా తమ పరిశ్రమ పనిచేస్తుందన్నారు. దేశంలోనే పర్యావరణ హిత నిర్మాణ పరిష్కారాలకు తమ ఉత్పత్తులు ఎంతో మెరుగైనవని చెప్పారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రస్తుతం 730 మందికి.. మరి కొద్ది రోజుల్లోనే 900 మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. 2023లో తమ పరిశ్రమ 1.51 లక్షల చదరపు అడుగుల నిర్మాణాన్ని 50 గంటల్లోనే పూర్తిచేసి గిన్నిస్ బుక్‌ఆఫ్ రికార్డు సాధించిందన్నారు. తమ పరిశ్రమకు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ చట్టాలకు అనుగుణంగా అన్ని అనుమతులతో అత్యంత నాణ్యతతో ప్యానల్స్‌ను ఉత్పత్తి చేస్తామని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ చైర్మన్ భజరంగ్‌బోత్ర, ఈడీ నిఖిల్ బోత్ర, పీఆర్వో ఆజామ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపతి ఐఐటీలో జేఈఈ అడ్వాన్స్‌డ్ అభ్యర్థులకు అవగాహన

ఏర్పేడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో శనివారం జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025లో అర్హత పొందిన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు క్యాంపస్‌లోని లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో ప్రారంభమవుతుంది. డైరెక్టర్, డీన్లు, విభాగాధిపతులతో అభ్యర్థులు ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశం కల్పించారు. తరువాత క్యాంపస్ విజిట్ ఉంటుంది. అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలు, డబుల్ డిగ్రీలు, బ్రాంచ్ మార్పు విధానం, హాస్టల్ వసతి, వైద్య సౌకర్యాలు తదితరాలపై అవగాహన పొందవచ్చు. ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్‌ద్వారా హాజరయ్యే అవకాశం ఉంది. వివరాలకు నెం. 0877-2503532లో సంప్రదించవచ్చు.

ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్‌గా రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజశేఖర్

కుప్పం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్‌గా రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. కుప్పం మండలం కంగుందికి చెందిన ఆయనకు ఇటీవలే ఈ పదవి లభించిన విషయం తెలిసిందే. దీంతో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం, వడ్డేశ్వరం వద్ద గల ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్యాలయంలో గురువారం సాయంత్రం రాజశేఖర్ పదవీ స్వీకారం చేశారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నంతోపాటు పలువురు ఆయన్ను ఈ సందర్భంగా సత్కరించారు.

పుష్పపల్లకీపై వరదుడి విహారం



శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి

యాదమరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): యాదమరిలోని శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం మూలవర్లకు పుష్పకైంకర్యం, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ద్వాదశి ఆరాధన జరిగింది. రాత్రి పుష్పపల్లకిలో ఆశీనులైన స్వామి, అమ్మవార్లు.. యాదమరి పురవీధులలో విహరించారు. భక్తులు కర్పూర హారతులు పట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కేరళ సంప్రదాయ వాయిద్యాలు, బాణాసంచా వేడుకలు ఆకట్టుకున్నాయి. శనివారం ఉదయం వడాయితోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.



ముస్తాబైన పుష్పపల్లకి



తిరుమలలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల తనిఖీ



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను తనిఖీ చేస్తున్న వెంకయ్య చౌదరి

తిరుమల, జూన్6(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శుక్రవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. సీఆర్వో, పీఏసీ వద్దనున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద పారిశుధ్యం, విక్రయిస్తున్న ఆహారపదార్థాలు, పనిచేసే వ్యక్తులు దుస్తులు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అదనపు ఈవో మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతను పెంపొందించేలా హోటళ్లలో సంప్రదాయ వంటకాలు, దుస్తులు ధరించి ఆహారం అందించడం శుభపరిణామం అన్నారు. గత పదకొండు నెలలుగా తిరుమలలోని హోటళ్లలో చైనీస్ వంటకాలు నిలిపివేయాలని చాలా ప్రయత్నిస్తున్నామన్నారు. సంప్రదాయ వంటకాలనే భక్తులకు విక్రయించాలని పలుమార్లు సమావేశాలు కూడా నిర్వహించామన్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల యజమానులకు పలు సూచనలు, సంప్రదాయ వంటకాలు, పరిశుభ్రతపై అవగాహన కల్పించామన్నారు. ఈక్రమంలో చైనీస్ వంటకాలను పూర్తిగా నిలిపివేసి సంప్రదాయ వంటకాలు, దుస్తులు ధరించడం ఆనందంగా ఉందన్నారు. 12 హోటళ్ల నిర్వాహకులు ముందుకు వచ్చి ఇలాంటి వాతావరణం కల్పించడం తిరుమల పవిత్రతకు దోహదపడతాయన్నారు. పూర్తిస్థాయిలో డిజిటల్ పేమెంట్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారని ప్రసంశించారు. రెవిన్యూ, హెల్త్ విభాగాల అధికారులు ఫాస్ట్‌ఫుడ్ నిర్వాహకులకు అవగాహన కల్పించడంలో విశేష కృషి చేశారన్నారు. హోటళ్లలో కూడా ఫీడ్ బ్యాక్ విధానం అమలుచేస్తామన్నారు.

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో బదిలీలు వన్‌వే!

వెళ్లేవారికి ఓకే.. వచ్చేవారికి నో వేకెన్సీ



చిత్తూరు ప్రభుత్వాస్పత్రి

చిత్తూరు రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో బదిలీలు వన్‌వే లా మారాయి. ఎవరైనా ఇక్కడినుంచి బదిలీపై ఎక్కడైనా వెళ్లొచ్చు. అదే మరో ఆస్పత్రి నుంచి ఇక్కడికి రావాలంటే మాత్రం నో వేకెన్సీ అని చూపుతోంది. దీనివల్ల ఏటా వైద్యుల నుంచి అటెండర్ వరకు అన్ని కేడర్ల ఉద్యోగులు బదిలీ అవుతుండటంతో సిబ్బంది కొరత ఏర్పడుతోంది. ఈ కారణంగా మిగిలిన సిబ్బంది, వైద్యులపై పనిభారం పడడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అనేకసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిని అపోలో సంస్థకు లీజుకు ఇవ్వడంతో ఆస్పత్రిలో బెడ్లు శాతం పెరిగింది. గతంలో 450 బెడ్లు ఉంటే ఇప్పుడు 800కు చేరాయి. గతంతో పోల్చుకుంటే ఓపీ శాతం కూడా బాగా పెరిగింది. రోజూ సుమారు 500 నుంచి వెయ్యి మంది వరకు రోగులు ఓపీకి వస్తుంటారు. దీంతో వైద్యులు, సిబ్బందిపై భారం, బాధ్యత పెరిగింది. ఆస్పత్రిలో 250 శాంక్షన్ పోస్టులకు 158 మంది మాత్రమే ఉన్నారు. 21 మంది వైద్యులకు కేవలం ఏడుగురు, 78 మంది స్టాఫ్ నర్సులకు 65 మంది, 151 మంది పారామెడికల్ సిబ్బందికి 79 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఐదేళ్లు పూర్తయినవాళ్లు అన్ని కేడర్లు కలిపి సుమారు 50మంది వరకు ఉన్నారు. వీరంతా తప్పనిసరిగా బదిలీ కావాలి. వీరు కూడా బదిలీ అయితే ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రమవుతుంది. దీనిపై రెండ్రోజుల కిందట ఆస్పత్రి పరిశీలనకు వచ్చిన డీఎస్‌హెచ్ బృందానికి అధికారులు విన్నవించారు. ఈ ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి బదిలీలు ఉంచకపోవచ్చునని డీఎస్‌హెచ్ సెక్రటరీ పద్మాకుమారి తెలిపినట్లు సమాచారం. అయితే ఏపీవీపీ ఉన్నతాధికారులు మాత్రం లాంగ్‌స్టాండ్ ఉన్న వైద్యులు, సిబ్బంది అప్లికేషన్లు పంపాలని ఆదేశించారని తెలుస్తోంది.

అయోమయంలో వైద్యులు, సిబ్బంది

బదిలీలపై క్లారిటీ లేకపోవడంతో వైద్యులు, సిబ్బంది అయోమయంలో పడ్డారు. స్టాఫ్‌నర్సులు, పారామెడికల్, ఆఫీస్ సిబ్బంది జిల్లాలో ఏదో ఒక ఆస్పత్రికి బదిలీ అయ్యే అవకాశం ఉంది. కానీ సివిల్ సర్జన్ బదిలీ అవ్వాలంటే 350 బెడ్ల ఆస్పత్రి అయినా ఉండాలి లేదా 150 బెడ్లు ఉన్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అయినా ఉండాలి. జిల్లాలో అటువంటి ఆస్పత్రి లేదు. దాంతో వారు బదిలీ అయితే జిల్లాలు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలు దాటినా రాష్ట్రంలో దాదాపు 16 జిల్లా ఆస్పత్రులను మెడికల్ కళాశాలలుగా మార్చారు. అక్కడా వారికి అవకాశం లేదు. వీరి పరిస్థితి మరింత దయనీయంగా మారింది.



సిబ్బంది లేకుంటే ఇబ్బంది పడతాం

చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిని బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని జేసీకి విన్నవించాం. ఇక్కడున్నవారు బదిలీ అయితే కొత్తగా రావడానికి వేకెన్సీ చూపడం లేదు. ఇప్పుడే సిబ్బంది కొరతతో ఇబ్బంది పడుతున్నాం. ఉన్నవారిపై పని భారం పడుతోంది. బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీవీపీ ఉన్నతాధికారులను కూడా కోరాం.

- పద్మాంజలిదేవి, డీసీహెచ్ఎస్

చిత్తూరులో 'కైలాసధామం' ప్రారంభం





శ్మశానవాటిక ముఖద్వారం - శ్మశానవాటికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, గల్లా రామచంద్రనాయుడు తదితరులు

చిత్తూరు అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని కైలాసపురంలో నూతనంగా నిర్మించిన కైలాసధామం మహాప్రస్థానం' పేరుతో శ్మశానవాటికను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, అమర రాజా బ్యాటరీస్ అధినేత గల్లా రామచంద్రనాయుడితో కలిసి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్, ఆర్యవైశ్య సంఘం నేతలు, దాతల సహాయంతో శ్మశాన వాటికలో గ్యాస్ ఆధారిత క్రిమిటోరియం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. తనను అడిగిన వెంటనే రూ.40లక్షలు విరాళంగా అందించానని, తనలాగా చాలామంది తోచినంతగా విరాళమిచ్చారన్నారు. ఆరణి శ్రీనివాసులు, గల్లా రామచంద్రనాయుడు మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఆహ్లాదకర వాతావరణంలో శ్మశానవాటికను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, కమిషనర్ నరసింహ ప్రసాద్, కైలాసధామం మహా ప్రస్థానం సొసైటీ అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి ద్వారకనాథ్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, ఇతర సంఘ నేతలు నరేష్‌బాబు, శరవణ, రమేష్‌బాబు, సుభాష్ జైన్, వెంకటేశ్ గుప్తా, సతీష్‌కుమార్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకంలో మేయర్ పేరెక్కడ?

మున్సిపల్ స్థలంలోనే శ్మశానవాటికను నిర్మించారు. జనరల్ ఫండ్ నుంచి నిర్మాణానికి రూ.1.30 కోట్లు ఖర్చు పెట్టారు. నిధులు, స్థలం మున్సిపాలిటీలో ఉన్నా.. నగర ప్రథమ పౌరురాలు అయినా కూడా మేయర్ అముద పేరు శిలాఫలకంలో లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. పైగా ఇద్దరు డిప్యూటీ మేయర్ల పేర్లు, కమిషనర్ పేరు, జిల్లాలోని అందరి ఎమ్మెల్యేల పేర్లు ఉండటం గమనార్హం. దళిత మేయర్ కావడం వల్లే తొలి నుంచీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆమెపట్ల వివక్ష చూపుతున్నారని స్థానికులు చర్చించుకున్నారు.



మేయర్ అముద పేరులేని శిలాఫలకం

ఎల్ఏ అథారిటీ ప్రిసైడింగ్ అధికారిగా అన్వర్

తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ అక్విజేషన్, రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్‌మెంట్ తిరుపతి ప్రాంతీయ అథారిటీకి ప్రిసైడింగ్ అధికారిగా జి.అన్వర్ బాషా నియమితులయ్యారు. ప్రజాహిత కార్యక్రమాలకు ప్రభుత్వం భూములు సేకరించే క్రమంలో రైతులు, యజమానులకు న్యాయమైన పరిహారం అందించడానికి, పునరావాసం కల్పించడానికి ప్రభుత్వం రాయలసీమ జిల్లాలకు కేంద్రంగా తిరుపతిలో ప్రాంతీయ అథారిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ అథారిటీకి తొలి ప్రిసైడింగ్ అధికారిగా నియమితులైన రిటైర్డు జిల్లా జడ్జి వెంగయ్య వయో పరిమితి దాటిన కారణంగా 2023 ఆగస్టులో ఈ పోస్టు నుంచి వైదొలిగారు. ఆ స్థానంలో యు.సత్యారావు ఎఫ్ఏసీగా కొనసాగుతున్నారు. తాజాగా ప్రభుత్వం రిటైర్డు జిల్లా జడ్జి జి.అన్వర్ బాషాను నియమించింది.

శ్రీకాళహస్తి విద్యార్థికి సీఎం ప్రశంస



శ్రీకాళహస్తి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లికి చెందిన భానుచరణ్‌రెడ్డిని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ఇతడికి జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 51వ ర్యాంకు వచ్చింది. విజయవాడలో శుక్రవారం భానుచరణ్‌ను సీఎం సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.అలాగే రాష్ట్ర మంత్రి నారాయణ కూడా అతడిని అభినందించారు.

నాలుగు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో నాలుగు మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. తవణంపల్లెలో 4.4, బైరెడ్డిపల్లెలో 3.8, పెద్దపంజాణిలో 2, పాలసముద్రంలో 1.4 మి.మీ వర్షం కురిసింది.

సారా కేసులో నిందితుడిపై పీడీ యాక్టు

చిత్తూరు సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సారా కేసుల్లో నిందితుడిగా ఉన్న గుడిపాల మండలం రాసనపల్లెకు చెందిన బి.చంద్రశేఖర్ (51)పై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో పీడీ యాక్టు నమోదు చేయడంతో నిందితుడిని చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ సీఐ శ్రీహరిరెడ్డి అదుపులోకి తీసుకుని.. కడపజిల్లా జైలుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

190 మందికి 'షైనింగ్ స్టార్' అవార్డులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులకు జిల్లాలోని 190 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఓపెన్ కేటగిరీ బాలురు 18 మంది, బాలికలు 48 మంది, బీసీ కేటరీరీలో 21 మంది బాలురు, 49 మంది బాలికలు, ఎస్టీ కేటగిరీలో ఏడుగురు బాలురు, 13 మంది బాలికలు, ఎస్సీ కేటగిరీలో 10 మంది బాలురు, 21 మంది బాలికలు, సీడబ్ల్యూ ఎస్ఎన్‌లో ఇద్దరు, సీడబ్ల్యూఎస్‌బీలో ఓ విద్యార్థి ఉన్నారు.

తడి, పొడి చెత్తను గడువుకు ముందే
ఎరువుగా మారుస్తాం



పలమనేరు కంపోస్టు యార్డు వద్ద జిగ్మా సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

పలమనేరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన గడువుకు ముందే కంపోస్టు యార్డులో పేరుకు పోయిన తడి, పొడి చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియను పూర్తిచేస్తామని జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిబ్బంది పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని చెత్తాచెదారాన్ని పలమనేరు సమీపంలోని గొబ్బిళ్లకోటూరు గ్రామ పొలిమేరల్లోని కంపోస్టుయార్డుకు రెండు దశాబ్దాలుగా తరలిస్తున్నారు. దీంతో కంపోస్టుయార్డుకు కేటాయించిన స్థలంలో గుట్టలు గుట్టలుగా పేరుకుపోయి తాజా చెత్తను అక్కడికి తరలించేందుకు వీలుకాని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఏడాది క్రితం వచ్చిన ప్రభుత్వం దృష్టికి అధికారులు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ప్రభుత్వం ఈ సమస్య కేవలం పలమనేరు మున్సిపాలిటీకే పరిమితం కాదని రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో ఉన్నట్లు గుర్తించింది. ఈ కంపోస్టు యార్డుల్లోని చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ బాధ్యతను జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు అప్పగించింది. కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన చెత్తను అక్టోబరు 2లోపు ఎరువుగా మార్చే ప్రక్రియను పూర్తిచేయాలని సూచించింది. శుక్రవారం పలమనేరు కంపోస్టు యార్డును మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి సందర్శించారు. ఇప్పటికే పై సంస్థ కంపోస్టు యార్డులో చెత్త నిర్వహణ కోసం పలు ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేసింది. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ సంస్థ సిబ్బందికి తడి, పొడి చెత్తల నిర్వహణపై, కంపోస్టు యార్డులో పేరుకుపోయిన చెత్త నిర్వహణపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోపు చెత్త తొలగింపు ప్రక్రియ పూర్తిచేయాలని సంస్థ సిబ్బందికి తెలియజేశారు. దీనిపై వారు మాట్లాడుతూ గడువుకు ముందే జూలై నెలాఖరులోపు పనులు పూర్తిచేసే అవకాశం ఉందని తెలిపారు.

స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లకు
పోటెత్తిన భక్తులు



భూదేవి కాంప్లెక్సులో

తిరుమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):తిరుపతిలో జారీ చేసే శ్రీవారి స్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టోకెన్ల కోసం భక్తులు పోటెత్తారు. టోకెన్లు జారీ చేసే కేంద్రాల వద్ద శుక్రవార భారీగా రద్దీ నెలకొంది. అలిపిరి భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణునివాసం కౌంటర్ల వద్దనున్న క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. రద్దీ పెరిగిన నేపథ్యంలో సాయంత్రం నుంచే శనివారానికి సంబంధించిన టోకెన్లను జారీ చేశారు. దీంతో మధ్యాహ్నం నుంచే భక్తులు ప్రవేశించడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. టీటీడీ పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి తోపులాట, తొక్కిసలాటలకు తావులేకుండా భక్తులు టోకెన్లు పొందారు.



శ్రీనివాసం వద్ద క్యూలలో భక్తులు

తిరుమలలో పెరిగిన రద్దీ

ఇక, తిరుమలలోనూ భక్తుల రద్దీ పెరిగింది. వారాంతం.. వేసవి సెలవులు ముగింపు దశకు రావడంతో శుక్రవారం ఉదయం నుంచే తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూకౌంటర్, అన్నప్రసాద భవనం, రాంభగీచ, లేపాక్షి సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండి.. క్యూలైన్ ఏటీజీహెచ్ సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 15 గంటల తర్వాత శ్రీవారి దర్శనం లభిస్తోంది. టైంస్లాట్ టోకెన్లు, టికెట్లున్న భక్తులకూ మూడు గంటలు పడుతోంది. గదులు కేటాయించే సీఆర్వో, ఎంబీసీ, పద్మావతి కౌంటర్లు.. కల్యాణకట్టల వద్దా రద్దీ నెలకొంది. ఎక్కువ మంది భక్తులు సొంత వాహనాల్లోనే రావడంతో అలిపిరి చెక్‌పాయింట్ రద్దీ కనిపించింది.

బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాలు


ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాలాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో వేద పండితులు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని అమ్మవారి అభిషేక గంధం, తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ నిర్వాహకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి

రొంపిచెర్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నిత్యజీవితంలో క్రమం తప్పకుండా యోగా సాధన చేయడంతో ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టరు వెంకటేశ్వరి అన్నారు. శుక్రవారం రొంపిచెర్ల పట్టణంలో యోగా, కిషోరవికాస్ కార్యక్రమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం మే 21 నుంచి ప్రారంభించి ఈనెల 21వతేదీ వరకు యోగా దినోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు తేలికపాటి యోగా చేయాలన్నారు. ఈసమావేశంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, డీసీపీవో సుబ్రమణ్యం, సీడీపీవో మల్లీశ్వరి, సూపర్‌వైజర్ శిరీషా, పీఈటీ హసన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

కల్లూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు-3 అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం పీడీ తనిఖీచేశారు. కేంద్రంలోని చిన్నారుల బరువు, ఎత్తును పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో మల్లీశ్వరి, సూపర్వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు సింధుశ్రీ, శ్యామల, తల్లులు పాల్గొన్నారు.


ప్రతి విద్యార్థీ నిర్దిష్ట లక్ష్యంతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి యాదగిరి

గంగవరం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్లినప్పుడే విజయం సాధించడానికి ఆస్కారం ఉంటుందని రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి యాదగిరి పేర్కొన్నారు. గంగవరంలో 21 రోజుల నుంచి నిర్వహించిన పినాక స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలతో పాటు, పట్టణాలకు చెందిన చాలామంది విద్యార్థులు చదువులో ఉత్తమ మార్కులు సాధించినా, ఇంటర్వ్యూల్లో తడబడి మంచి అవకాశాలను పోగుట్టుకుంటున్నారని చెప్పారు. అలాంటి వారికి నైపుణ్యం పెంచి సులభంగా ఉద్యోగాలు సాధించేలా తీర్చిదిద్దడమే మా సంస్థ లక్ష్యమన్నారు. పలమనేరు, నగరి, రాయచోటి, మదనపల్లెలలో కూడా 21రోజులుగా ఉచితంగా ఈ శిక్షణ ఇచ్చామన్నారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి, కేవీ రామ్మూర్తి, ముద్దుకృష్ణ, సుబ్రమణ్యం, సోమశేఖర్‌గౌడు, జయప్ప, ధర్మతేజ, రూప్‌కుమార్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ అవార్డుకు ముగ్గురు విద్యార్థినుల ఎంపిక


అల్బిన్, మోక్షజ్ఞ, ఫిజా అంజుమ్

గంగవరం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డు విడుదల చేసిన ప్రతిభ అవార్డులకు స్థానిక శ్రీవాణి, మధు విద్యాసంస్థలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ కృష్ణమూర్తిరెడ్డి తెలిపారు. మధు, శ్రీవాణి విద్యాసంస్థలకు చెందిన బైపీసీ గ్రూపులో ఎస్.అల్బిన్ 1000కి 989 మార్కులు, ఎంపీసీలో మోక్షజ్ఞ 1000కి 983 మార్కులు, సీఈసీకి చెందిన ఫిజా అంజుమ్ 1000కి 970 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులకు ప్రతిభ అవార్డును ప్రకటించినట్లు తెలిపారు. ఈ విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, అధ్యాపక బృందం అభినందించారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించాలి


హిందూ, ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న ఎస్ఐ నాగేశ్వరరావు

చౌడేపల్లె, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో హిందూ, ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు అందరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో హిందూ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఆరు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

- నలుగురి అరెస్టు


పట్టుబడ్డ నిందితులు

యాదమరి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-పలమనేరు హైవేలోని వరిగపల్లె సమీపాన సుమారు ఆరు టన్నుల రేషన్ బియ్యాన్ని తహసీల్దార్ పార్థసారథి, యాదమరి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. పలమనేరుకు చెందిన సద్దాం హుస్సేన్, బైరెడ్డిపల్లె మండలానికి చెందిన కిషోర్ రెడ్డి, బలరాం రెడ్డి, దేవేంద్రరెడ్డి, బంగారుపాళ్యం మండలానికి చెందిన మోతిష్‌లు కలసి సుమారు ఆరు టన్నుల రేషన్ బియ్యాన్ని రెండు వాహనాల్లో లోడ్ చేసుకుని రవాణా చేస్తుండగా.. సద్దాం హుస్సేన్‌తప్ప మిగిలిన నలుగురిని అరెస్టుచేశారు. వారి నుంచి వాహనాలతోపాటు బియ్యం, రూ.78వేలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆకట్టుకున్న బకాసుర వధ

సోమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ భారతంమిట్టలో మహాభారత యజ్ఞంలో భాగంగా ఉభయదారులు కోటకొండ లోకేశ్ పంచపాండవ విగ్రహాలకు అభిషేక పూజలు జరిపి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాల్లో దిడ్డివారిపల్లె, వడ్డిపల్లె, భారతంమిట్ట, పాయలవారిపల్లె, గన్నావారిపల్లె సోమల భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు


లక్ష్మీనరసింహస్వామి పూజల్లో పాల్గొన్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడూరుపల్లె వద్ద నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న మహాసంప్రోక్షణ కుంభాభిషేక కార్యక్రమంలో శుక్రవారం టీడీపీ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేయడంతో ఆయన మొక్కులు తీర్చుకుని, తీర్థప్రసాదాలను అందుకున్నారు. అనంతరం గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన బోయకొండ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, వర్షాలు సక్రమంగా కురిసి పంటలు సంవృద్ధిగా పండాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, శ్రీకాంత్, పురుషోత్తంరాజు, రెడ్డప్పయాదవ్, రమణయాదవ్, గంగాధర్, ప్రసాద్‌స్వామి, శమీపతి, రామకృష్ణానాయక్, కవిత, గిరిబాబు, రమణ, జనసేన నాయకులు పగడాల రమణ, విరూపాక్షి, శ్రీనివాసులు, నాగరాజనాయక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్య అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం నవధాన్య అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారికి చీరలు, రవికలు మొక్కులు చెల్లించి, తీర్థప్రసాదాలు అందుకున్నారు.

గోతిలో పడ్డ ఆవు


గోతిలో నుంచి బయటపడిన ఆవు

చౌడేపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న ఓగోతిలో శుక్రవారం పాడి ఆవు ప్రమాదవశాత్తు పడింది. స్థానిక ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం నిర్మించేందుకు నాలుగు నెలల ముందు చిత్తూరుకు చెందిన ఓ కాంట్రాక్టర్ పిల్లర్ల నిర్మాణం కోసం పెద్ద గోతులు తవ్వారు. ఆ గోతుల్లో నిర్మాణాలు చేపట్టక పోవటంతో ప్రమాదభరితంగా ఉన్నాయి. ఇటీవల వర్షాలు కురవటంతో గోతుల్లోకి వర్షపు నీరు చేరింది. ఈ క్రమంలో ఓ రైతుకు చెందిన పాడి ఆవు శుక్రవారం గడ్డికోసం వచ్చి ప్రమాదభరితంగా ఉన్న గోతిలో పడింది. గుర్తించిన స్థానికులు పాడి ఆవును రక్షించారు. అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు చేపట్టటమో, లేక ప్రమాదంగా ఉన్న గోతులను పూడ్చటమో చేయాల్సి ఉంది.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం పుంగనూరు పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు.... పట్టణంలోని మేలుపట్లకు చెందిన జబీవుల్లా(22) కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి స్పృహ కోల్పోవడంతో కుటుంబసభ్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమించిందని డాక్టర్లు తెలపడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


కలెక్టర్ నుంచి రూ.50 వేలు చెక్కు తీసుకుంటున్న మురళి కుటుంబ సభ్యులు

చౌడేపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ రూ.50 వేలు ఆర్థిక సాయం అందించినట్లు తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ..మండలంలోని అమినిగుంటకు చెందిన పేద రైతు మురళి మే 30న మహానాడుకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాక గుండెపోటుతో మృతిచెందగా, వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిధరగుప్తా

పలమనేరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ పలమనేరు డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక సీఐటీయూ నాయకులు గిరిధరగుప్తా డిపో మేనేజర్ స్వామికి వినతిపత్రం సమర్పించారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, టెండర్ ప్రకారం జీతాలు, పండుగ సెలవులు, మెటర్నిటీ సెలవులు ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శారదమ్మ, బుజ్జమ్మ, గాయత్రి, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

పల్లకిలో విహరించిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి


ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్‌లు

సోమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సోమల బంగారు తిరుత్తణి కొండపై కొలువుదీరిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. ఆలయంలోని మూలవిరాట్లకు కుంభాభిషేకం జరిపారు. స్వామివార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో అలంకరించి సోమల పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త మేల్నాటి పద్మావతమ్మ, రెడ్డి జనార్ధన్, విశ్వనాథ నాయుడు, పూల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూపుమారని రైతు సేవా కేంద్రం


కేంద్రం ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

రామకుప్పం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఏడాది గడిచినా రామకుప్పం మండలం కెంచనబల్లలోని రైతు సేవా కేంద్రం రూపు మాత్రం మారలేదు. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. తరచూ రైతులు ఏదో ఒక పనిపై ఈ కేంద్రానికి వస్తుంటారు. కేంద్రం ముందు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. చెత్తాచెదారం కూడా పేరుకుపోతోంది. దీంతో దుర్వాసన, దోమల బెడదతో రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చి నెలలు గడుస్తున్నాయి. అన్ని గ్రామాల్లో పేర్లు మార్చి కెంచనబల్లలో మాత్రం కేంద్రంపై రైతు భరోసా కేంద్రం అని కొనసాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కెంచనబల్లలోని రైతు సేవా కేంద్రం ఆవరణను శుభ్రం చేయాలని, అదేవిధంగా కేంద్రంపై పేరును రైతు సేవా కేంద్రం అని మార్చాలని రైతులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం

● మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో ప్రజా సంక్షేమం సాధ్యపడుతుందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన ఘనత చంద్రబాబుదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచి 64 లక్షల మందికి నెలకు రూ.2,720 కోట్లు ఏడాదిలో రూ.34వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడదల చేశారన్నారు. దీపం పథకం కింద సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసిందన్నారు. రూ.1200 కోట్లతో 20వేల కిలోమీటర్ల రోడ్లు బాగు చేసిందన్నారు. మత్స్యకారులకు నెలకు రూ.20వేలు ఆర్థిక సాయం కింద రూ.259 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందన్నారు. 203 అన్న క్యాంటీన్లతో పేదల కడుపు నింపుతున్నట్లు తెలిపారు. చెత్త పన్ను రద్దు చేయడమే కాకుండా గత ప్రభుత్వ నిర్లక్షంతో పేరుకుపోయిన 83 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం రాగానే 55,57,525 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, 8.50 లక్షల మంది రైతులకు రూ.13,584 కోట్లు చెల్లించిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం రూ.990 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో 78 ప్రాజెక్టుల ద్వారా రూ.9.20లక్షల కోట్ల పెట్టుబడులు రావడంతో 5.70 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఈ నెలలోనే తల్లికి వందనం, అన్నదాత పథకాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంకు కూడా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇలా కూటమి ప్రభుత్వం రావడంతో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు సమపాళ్లల్లో పరుగులు పెడుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలు, అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు తప్ప అభివృద్ధి, సంక్షేమం జరగలేదని ఆరోపించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానంతోపాటు వినోదం కూడా దొరుకుతుందని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు అన్నారు. కుప్పం శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో 35 రోజులుగా బాలబాలికలకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంనాటితో ముగిసింది. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సత్యవాణి ఆధ్వర్యంలో ముగింపు సమావేశం జరిగింది. వేసవి శిక్షణ శిబిరంలో పలు అంశాలపై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం ఘర్షణ

● గ్రామం నుంచి బహిష్కరించారని బాధితుల వేదన


పోలీసు స్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న చిన్నికృష్ణ కుటుంబసభ్యులు

పుంగనూరు రూరల్ జూన్ 6(ఆంధ్రజ్యోతి): అన్నాతమ్ముళ్ల మధ్య ఆస్తి కోసం జరిగిన ఘర్షణతో తమ కుటుంబాన్ని గ్రామంలో బహిష్కరించినట్లు చిన్నికృష్ణ కుటుంబసభ్యులు ఆరోపించారు. శుక్రవారం బాధితులు తెలిపిన కథనం మేరకు... పుంగనూరు మండలం ఆరడిగుంట పంచాయతీ అమ్మిగానిపల్లెకు చెందిన శీనప్ప, చిన్నికృష్ణ అన్నాతమ్ముళ్ల పిల్లలు. రెండేళ్ల క్రితం అన్నాతమ్ముళ్ల భూమి భాగపరిష్కారాల్లో భాగంగా చిన్నికృష్ణకు 0.9 సెంట్ల భూమి, చింతచెట్టు కేటాయించారు. అప్పట్లో శీనప్ప కుటుంబసభ్యులు, చిన్నికృష్ణ కుటుంబసభ్యులు ఘర్షణపడి ఫిర్యాదులు చేసుకోవడంతో పోలీసులు ఇరువర్గాలను మందలించారు. అప్పటి నుంచి గ్రామంలో జరిగిన పండుగలకు చిన్నికృష్ణ కుటుంబసభ్యులు గ్రామస్తులతో కలవకుండా దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం భూమిలోని చింతచెట్టును శీనప్ప కొట్టివేయడంతో మళ్లీ ఇరువర్గాలు ఘర్షణపడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. దీంతో చిన్నికృష్ణ కుటుంబసభ్యులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తమకు న్యాయం జరగలేదని, గ్రామంలో రెండేళ్లుగా తమను దూరం పెట్టారని మీడియాతో మొరపెట్టుకున్నారు. ఈవిషయంపై గ్రామ పెద్దలు మాట్లాడుతూ... అందరూ కలసి పండుగ చేయాలని తెలిపినా చిన్నికృష్ణ కుటుంబసభ్యులు గ్రామస్తులతో కలవడానికి ఇష్టంలేదని తేల్చి చెప్పడంతో మళ్లీ వారిని పిలవలేదన్నారు. సీఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ భూతగదా కారణంగా గొడవలు చేసుకుని పోలీసుస్టేషన్‌కు రావడంతో ఈ విషయాన్ని తహసీల్దార్ రాము దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. త్వరలోనే వివాదాస్పదమైన భూమిని పరిశీలించనున్నట్లు చెప్పారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలు పెట్టాలి

రొంపిచెర్ల, జూన్ 6(ఆంధ్యజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నిర్వహణలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఎమ్మార్సీలో బొమ్మయ్యగారిపల్లె, పెద్దమల్లెల, గానుగచింత, రొంపిచెర్ల ఉర్దూ, బాలికల, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనం నిర్వహణపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. సీఆర్సీ ప్రధానోపాధ్యాయుడు అమరశేఖర్, ఉపాధ్యాయులు ధనలక్ష్మి, రవీంద్రారెడ్డి, ఎర్రయ్య, యల్లప్ప, రాజేంద్ర, రవికుమార్‌రెడ్డి, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం


మృతుడి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం 89పెద్దూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వెంకటేశ్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. పార్టీ ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కామరాజనాయక్, బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మనోహర్, తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌లు స్థానిక నేతలతో కలిసి వెంకటేశ్ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులకు వారు పార్టీ తరపున రూ.10వేలు అందజేశారు. యూనిట్ ఇన్‌చార్జి గజేంద్ర, పంచాయతీ అధ్యక్షుడు లోకేష్, నేతలు రమేష్, చంద్ర, బాబు పాల్గొన్నారు.

రేపు సదుంలో ఉచిత కంటి వైద్య శిబిరం

సదుం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈనెల 8వతేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్థానిక సదుం సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించిన వారికి అదే రోజున ఉచిత భోజన, వసతి, రవాణా సదుపాయాలతో తిరుపతిలోని అరవింద కంటి ఆస్పత్రికి తీసుకెళతారని వివరించారు. శస్త్రచికిత్స అనంతరం రెండ్రోజుల తరువాత మళ్లీ శిబిరం వద్దకు చేరుస్తారని, ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

సమాజసేవే లయన్స్‌క్లబ్ లక్ష్యం


నిరుపేద పిల్లలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

కల్లూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సమాజసేవే లయన్స్‌క్లబ్ లక్ష్యమని జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షులు మహమ్మదాలి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిదండ్రులను పోగొట్టుకున్న నిరుపేద పిల్లలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోత్స్న, జాహ్నవి, బాలరాజు అనే పిల్లలు బాల్యంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్నారన్నారు. అమ్మమ్మ వద్ద ఉంటున్న ఈ ముగ్గురు చిన్నారుల బాధ్యత పెద్ద కుమార్తె జోత్స్నపై పడిందన్నారు. వీరి కష్టాలను గుర్తించిన లయన్స్‌క్లబ్ నాలుగు నెలలకు సరిపడే సరుకులు ఇచ్చినట్లు చెప్పారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్‌తో పాటు 6,7,8,9 తరగతుల్లోని మిగులు సీట్లలో చేరడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించిందని ప్రిన్సిపాల్ ఎండీ కేవీ లత తెలిపారు. విద్యార్థులు జూన్ 5 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకొన్న విద్యార్థులకు జూన్ 24న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామన్నారు. మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు. లేదా 81218 48347 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలన్నారు.

● రొంపిచెర్ల (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకోసం ఈనెల 5వ తేదీ నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సరళ పేర్కొన్నారు. 6,7,8,9తోపాటు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రవేశాలకు అర్హులన్నారు. దరఖాస్తు చేసిన వారికి ప్రవేశ పరీక్ష ఈనెల 24వతేది రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో నిర్వహించి, మెరిట్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు ఆమె తెలిపారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందజేయాలి

సోమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందజేయాలని ఎంఈవో శివరత్న తెలిపారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. వంట గదుల పరిసరాలు పరిశుభ్రంగా పెట్టుకోవాలని, పోషక ఆహారాన్ని అందించడంతో మెలకువలు వివరించారు. మెనూ ప్రకారం భోజనం అందజేయాలన్నారు. కార్మికులు మాట్లాడుతూ నెలకు రూ. 10వేలు వేతనం చెల్లించాలని, వంటకు అవసరమైన గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కేశవరెడ్డి, డీఆర్పీ జయలక్ష్మి, సీఆర్పీలు సోమశేఖర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



ఆళ్లమడుగులో బాధితురాలి సమస్య తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ ఆదేశించారు. శుక్రవారం వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు గ్రామ సచివాలయ వద్ద 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. తహసీల్దార్ బాబు, ఎంపీడీవో పురుషోత్తం, ఉద్యోగులు, నాయకులు హాజరయ్యారు.

రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకోవాలి: రైతులందరూ భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని థామస్ సూచించారు. శుక్రవారం కార్వేటినగరం మండలంలో ఆర్కేవీబీపేట, అన్నూరు, ఎన్ఆర్‌కండ్రిగ ప్రాంతాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం జరిగింది. అన్నూరులో జరిగిన కార్యక్రమానికి థామస్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయంతోపాటు యాంత్రీకరణపై దృష్టి పెట్టాలన్నారు. తర్వాత వేరుశనగ విత్తనాలు, ఇతర రాయితీ పరికరాలను రైతులకు అందజేశారు. అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'ఎన్ఎంఎంఎస్'కు ఐదుగురు విద్యార్థుల ఎంపిక



సి.పి.త్రిష - జి.ప్రదీప్ - వి.వేదవ్యాస్ - లక్ష్మీప్రియ - గంగవర్షిణి

యాదమరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. డీకేచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సి.పి.త్రిష, కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థి జి.ప్రదీప్, వరిగపల్లె పాఠశాల విద్యార్థి వి.వేదవ్యాస్‌లు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మజీద్ సాహెబ్, రవీంద్రారెడ్డి, హిమబిందు తెలిపారు. వీరిలో త్రిష జిల్లాస్థాయిలో 150 మార్కులకు 109 మార్కులు సాధించి తృతీయ స్థానం సాధించిందన్నారు. విద్యార్థులను ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, పీఆర్టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి, ఉపాధ్యాయులు భారతి, షెహనాజ్, గిరి, గ్రామస్థులు అభినందించారు.

ఐరాల: మండలంలోని పుత్రమద్ది జడ్పీహైస్కూల్‌కు చెందిన గంగవర్షిణి, లక్ష్మీప్రియ ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం హేమచంద్రారెడ్డి తెలిపారు. విద్యార్థులను టీచర్లతో కలిసి అభినందించారు.

త్యాగానికి, మత సామరస్యానికి ప్రతీక బక్రీద్

చిత్తూరు అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి, మత సామరస్యానికి ప్రతీక బక్రీద్ పండగ అని ఎస్పీ మణికంఠ పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఈ పర్వదినాన్ని ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఇప్పటికే అందుకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ కొన్ని సూచనలు, నిబంధనలను తెలియజేశారు. ● గోవధ చట్టం-2017 ప్రకారం గోవులను వధించడం నేరం. ● గోవులను ఒక ప్రదేశం నుంచి మరొక ప్రాంతానికి తరలించేటప్పుడు వాటికి సంబంధించిన పత్రాలను ఉంచుకోవాలి. ● శాంతి భద్రతల సమస్యలు తలెత్తే విధంగా ప్రవర్తించేవారిపై చర్యలుంటాయి. ● సోషల్ మీడియాలో మత సంఘర్షణలు తలెత్తేలా పోస్టులు పెట్టడం నేరం. ● ఎక్కడైనా అసాంఘిక, అనైతిక కార్యక్రమాలు జరుగుతుంటే డయల్ 112 లేదా పోలీసు వాట్సాప్ నెంబరు 94409 00005కు సమాచారం ఇవ్వాలి.

టీబీ వ్యాధిపై అవగాహన కల్పించండి



కొ్ట్రకోనలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకటప్రసాద్

పాలసముద్రం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించాలని పాలసముద్రం పీహెచ్‌సీ సిబ్బందికి జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ సూచించారు. శుక్రవారం పీహెచ్‌సీలో సిబ్బంది, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. డాక్టర్‌మోహన్‌కృష్ణ, సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: కొ్ట్రకోన, ముక్కళత్తూరు, అగరమంగళం పంచాయతీ కేంద్రాల్లో టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం చిత్తూరు ప్రధాన ఆస్పత్రిలో 24 నెంబరు ఓపీ గది వద్దకు రావాలన్నారు. అక్కడ ఎక్స్‌రే, గల్లపరీక్షలు చేస్తారన్నారు. జీడీనెల్లూరు పీహెచ్‌సీ డాక్టర్లు ప్రవీణ్, గురుప్రకాష్, సీహెచ్‌వో శ్రీనివాసులు, మాజీసర్పంచ్ జాన్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

మామిడి రైతులు నష్టపోకుండా చూడాలి: ఎమ్మెల్యే

చిత్తూరు సెంట్రల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మామిడికి గిట్టుబాటు ధర ప్రకటించిన క్రమంలో రైతులు నష్టపోకుండా చూడాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులోని మామిడి మండీల్లో కలియతిరిగి రైతులతో, మండీల యజమానులతో, ఎగుమతిదారులతో ధరలపై మాట్లాడారు. అలాగే మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్‌కు పలు సూచనలు చేశారు. దళారీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, నేతలు కాజూరు బాలాజీ, చంద్రప్రకాష్, వసంతకుమార్,జయచంద్రనాయుడు,వెంకటేష్‌యాదవ్, కోదండయాదవ్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



చిత్తూరు అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు మూడు జతల దుస్తులను ఎమ్మెల్యే జగన్మోహన్ అందించారు. శుక్రవారం కట్టమంచిలోని మామిడికాయల మండిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీటిని పంపిణీ చేశారు. కమిషనర్ నరసింహ ప్రసాద్, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు చంద్రప్రకాష్, ఎంహెచ్‌వో లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలందాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న జడ్పీటీసీ సుకుమార్

వెదురుకుప్పం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలందాలని వెదురుకుప్పం జడ్పీటీసీ సభ్యుడు చలంపాళ్యం సుకుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశపు మందిరంలో ఎంపీపీ నాగరాణి అధ్యక్షతన వెదురుకుప్పం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేద్దామన్నారు. వెదురుకుప్పంలో అప్రకటిత విద్యుత్ కోతలు ఉన్నాయని, సిబ్బంది పనితీరు సరిగా లేదని వెదురుకుప్పం, దేవరగుడిపల్లె, బొమ్మయ్యపల్లె సర్పంలు శిల్ప, ఆశీర్వాదం, గోవిందయ్య ఆగ్రహించారు. రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీపైనా సమగ్ర సమాచారం లేదని తిరుమలయ్యపల్లె ఎంపీటీసీ హరి అన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించిందని ఎంపీపీ నాగరాణి విమర్శించారు. వివిధ శాఖల ఉద్యోగులు తమ శాఖల ప్రగతిని వివరించారు. ఎంపీడీవో పురుషోత్తం, సభ్యులు పాల్గొన్నారు.

విధుల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

శ్రీరంగరాజపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎగువకమ్మకండ్రిగ గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ వి.వెంకటేశులును విధుల నుంచి తొలగించారు. ఉపాధి శ్రామికులకు పని కల్పించక పోవడంతోపాటు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడని ఆయనపై గ్రామస్థులు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ చేయడంతో వాస్తవమని తేలింది. ఈనేపథ్యంలో వెంకటేశులును ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించమని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలతో ఎంపీడీవో మోహనమురళి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రైతులకు పశువుల దాణా పంపిణీ

పూతలపట్టు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పి.కొత్తకోట పశువుల ఆస్పత్రి వైద్యాధికారుల ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత బాబురావు మాట్లాడుతూ సబ్సిడీతో ప్రభుత్వం ఇస్తున్న పశువుల దాణాను రైతులు తీసుకొని పాల దిగుబడిని పెంచుకోవాలన్నారు. టీడీపీ నాయకులు సురేంద్ర నాయుడు, మురళీనాయుడు, ఆదికేశవులు నాయుడు, మునిరత్నం నాయుడు, స్థానిక సర్పంచ్ పద్మజారాణి, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.





కె.కొత్తూరు వద్ద రహదారి

బాగుపడ్డ రహదారులు

హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

యాదమరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో యాదమరి మండల పరిధిలోని అంతర్రాష్ట్ర రోడ్డుతోపాటు గ్రామీణ రహదారులూ బాగుపడ్డాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతర్రాష్ట్ర రహదారి 25 కి.మీ. దూరం, గ్రామీణ దారులు దాదాపు 75 కి.మీ. ఉంటాయి. వైసీపీ హయాంలో రహదారుల నిర్మాణం, మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇవన్నీ అధ్వానంగా మారాయి. స్థానికులు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత ఎన్నికల ప్రచారంలో ఈ రోడ్లను బాగు చేస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆయన ఎమ్మెల్యే అయ్యాక ప్రత్యేక చొరవ తీసుకుని కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి అంతర్రాష్ట్ర రహదారిని రూ.7.20 కోట్లతో మరమ్మతులు చేయించారు. అలాగే భూమిరెడ్డిపల్లె, కొట్టాల, మాదిరెడ్డిపల్లె తదితర ప్రాంతాల్లోనూ రహదారుల మరమ్మతులు పూర్తయ్యాయి.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యేలు మురళీమోహన్, అమరనాథరెడ్డి



సరకల్లులో రైతుకు వేరుశనగ విత్తన కాయల బస్తా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు మురళీమోహన్, అమరనాథరెడ్డి

తవణంపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు, పలమనేరు ఎమ్మెల్యేలు మురళీ మోహన్, అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం తవణంపల్లె మండలంలోని సరకల్లులో నూతనంగా నిర్మించిన మహిళ సమాఖ్య సమావేశ భవనం, సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన కాళికాదేవి, విజయగణపతి ఆలయాల కుంభాభిషేకం పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వం రైతులకు రాయితీపై అందిస్తున్న వేరుశనగ విత్తన కాయల పంపిణీని ప్రారంభించారు. మొట్టుకూరులో నూతనంగానిర్మించిన సీతారాముల ఆలయ కుంభాభిషేకానికీ హాజరయ్యారు. కాగా, తవణంపల్లె పీహెచ్‌సీలో రూ.50లక్షలతో నిర్మించిన ల్యాబ్, వెయిటింగ్ హాలును ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రారంభించి, ప్రసంగించారు. పీహెచ్‌సీలో కార్పొరేట్‌స్థాయిలో వసతుల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు, బంగారుపాళ్యం టీడీపీ అధ్యక్షులు గాలి దిలీప్, హరిబాబునాయుడు, దొరబాబుచౌదరి, ధరణి, మాజీ జడ్పీటీసీలు వెంకటేష్‌చౌదరి, లత బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు, ఐరాల జడ్పీటీసీ సుచిత్ర తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, మండల వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు, నాయకులు ధనంజయనాయుడు, ప్రవీణ్, మోహన్ నాయుడు, అమరేంద్రనాయుడు, సర్పంచ్‌లు సతీష్, చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెరియంబాడిలో వైద్యశిబిరం



స్థానికులకు సూచనలిస్తున్న వైద్య సిబ్బంది

యాదమరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పెరియంబాడి గ్రామంలో గురువారం పలువురు వాంతులు, అతిసారంతో పీహెచ్‌సీ, చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్, సిబ్బంది గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రెండ్రోజులపాటు నిల్వ ఉంచిన మాంసాహారం తీసుకోవడం వల్ల అతిసారం వచ్చే ప్రమాదం ఉందన్నారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.


సమస్యలను సకాలంలో పరిష్కరించాలి: కమిషనర్



బాధితురాలి అర్జీని పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కారవేదిక' కార్యక్రమంలో బాధితుల నుంచి 32 అర్జీలను స్వీకరించారు. వీటిల్లో.. నీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాల సమస్యలను రెండ్రోజుల్లోగా పరిష్కరించాలని, మిగిలినవాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామిరెడ్డి, గుడిపాల తహసీల్దార్ జయంతి, చిత్తూరు రూరల్ ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడండి



తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

పూతలపట్టు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టులో ప్రసిద్ధిగాంచిన భీమేశ్వరస్వామి ఆలయ భూములను కాపాడాలని స్థానికులు శుక్రవారం తహసీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. శివాలయ భూములతోపాటు నీవానది సమీపాన ఉన్న మునీశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిని కొందరు ఆక్రమించుకుని చెట్లు నాటేశారని చెప్పారు. ప్రస్తుతం ఆలయానికి వెళ్లడానికి దారిలేకుండా భక్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని ఆలయ భూములను కాపాలని కోరారు.

మహాభారత ఉత్సవాలకు ధ్వజారోహణం



వెదురుకుప్పం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లం మహాభారత ఉత్సవాలకు శుక్రవారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం కార్యక్రమం జరిగింది. ఆలయంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. రోజూ పగలు హరికథ కాలక్షేపం, రాత్రి వీధి నాటకాలు ఉంటాయి. ఈనెల 15వ తేదీతో ఉత్సవాలు ముగుస్తాయని కార్యనిర్వాహకులు తెలిపారు.

పాలట్యాంకర్ నుంచి పడి ఒకరి మృతి



రాజశేఖర్ రెడ్డి మృతదేహం

యాదమరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పాల ట్యాంకర్‌నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలంలోని ఎగువగుట్టకింద ఊరు గ్రామానికి చెందిన పెమ్మిరెడ్డి కుమారుడు ఎన్.రాజశేఖర్ రెడ్డి మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ డెయిరీలో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ట్యాంకర్‌లో పాలు నింపాక సీలు వేసే క్రమంలో వాహనంపైనుంచి ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడ్డాడు. తలకు దెబ్బతగలడంతో అక్కడున్న వారు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.



మద్యం విక్రేత అరెస్టు

తవణంపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. ఎస్‌ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరబ్రాహ్మణపల్లె పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన శరవణ కుమారుడు దిలీప్ వడ్డిపల్లె క్రాస్ వద్ద మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందింది. దాడి చేసి దిలీప్‌ను అరెస్టు చేసి.. అతడి వద్ద ఉన్న 21 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

● నలుగురి అరెస్టు



పట్టుబడ్డ నిందితులు

యాదమరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-పలమనేరు హైవేలోని వరిగపల్లె సమీపాన సుమారు ఆరు టన్నుల రేషన్ బియ్యాన్ని తహసీల్దార్ పార్థసారథి, యాదమరి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. పలమనేరుకు చెందిన సద్దాం హుస్సేన్, బైరెడ్డిపల్లె మండలానికి చెందిన కిషోర్ రెడ్డి, బలరాం రెడ్డి, దేవేంద్రరెడ్డి, బంగారుపాళ్యం మండలానికి చెందిన మోతిష్‌లు కలసి సుమారు ఆరు టన్నుల రేషన్ బియ్యాన్ని రెండు వాహనాల్లో లోడ్ చేసుకుని రవాణా చేస్తుండగా.. సద్దాం హుస్సేన్‌తప్ప మిగిలిన నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి వాహనాలతోపాటు బియ్యం, రూ.78వేలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ మహేశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. పూతలపట్టు మండలం వడ్డేపల్లెకి చెందిన బాలాజీ(44) నగరంలోని శాంతినగర్ కాలనీలోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా, లాండ్రీ వర్క్ చేసుకుంటూ ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. మద్యం తాగే అలవాటు ఉండటంతో శుక్రవారం అధికంగా పూటుగా తాగాడు. ఆ మత్తులో జీవితంపై విరక్తి చెంది చిన్న వైరుతో తాను నివాసం ఉంటున్న షెడ్డులో కమ్మీకి ఉరేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం పుంగనూరు పట్టణంలో జరిగింది. పట్టణంలోని మేలుపట్లకు చెందిన జబీవుల్లా(22) కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి స్పృహ కోల్పోవడంతో కుటుంబసభ్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమించిందని డాక్టర్లు తెలపడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకి తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.

మొక్కలు నాటిన సత్యసాయి సేవా సమితి సభ్యులు

చిత్తూరు కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కైలాసధామంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు ప్రేమతరు కార్యక్రమంలో భాగంగా తులసి, మామిడి, మర్రి, దానిమ్మ, జామ రకాలకు చెందిన 200 మొక్కలను శుక్రవారం నాటారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబా భజనలతో అలరించారు.

మొక్కుబడి సమావేశాలు నిర్వహించొద్దు: ఎంపీపీ



కార్వేటినగరంలో నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లత

వెదురుకుప్పం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సభ్యులు ప్రస్తావించే సమస్యలను పరిష్కరించడంపై అధికారులు దృష్టి పెట్టాలని, మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించొద్దని కార్వేటినగరం ఎంపీపీ లత సూచించారు. శుక్రవారం ఆమె అధ్యక్షత కార్వేటినగరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ.. సమావేశానికి గైర్హాజరైన ఉద్యోగులకు మెమోలు ఇవ్వాలని ఎంపీడీవో చంద్రమౌళిని ఆదేశించారు. కార్పొరేషన్ల రుణాలు ఇవ్వడంలో జాప్యం జరిగితే వారి తరఫున ఉద్యమాలు చేస్తామన్నారు. పలు సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. మండల అధికారులు పాల్గొన్నారు. కాగా, కార్వేటినగరంలో రూ.30లక్షలతో నూతనంగా నిర్మించిన ఎంపీపీ కార్యాలయ భవనాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతోపాటు ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

దుర్గాంబ ఆలయ ఈవోగా తిమ్మారెడ్డి

చిత్తూరు కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గిగింపేట దుర్గాంబ ఆలయ ఈవోగా జీవకారుణ్య అన్నదాన సమాజం ఈవో తిమ్మారెడ్డి నియమితులయ్యారు. శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు ఈవోగా పనిచేసిన మునిశేఖర్ తిరుపతి జిల్లా సంయుక్త ఆలయాల ఈవోగా బదిలీ అయ్యారు.

బోరు ప్రారంభం



పాలసముద్రం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణజిమ్మాపురం పంచాయతీ పెరుమాళ్లనాయుడుకండ్రిగలో ఎమ్మెల్యే థామస్ సూచనలతో తన నిధుల నుంచి ఎంపీపీ శ్యామలాశావప్రకాష్‌రాజు బోరు వేయించి, శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ భానుప్రియ తంగరాజ్ పాల్గొన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంపై ఎమ్మెల్యేకి, ఎంపీపీకి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

'కైలాసధామం'కు రూ. 2లక్షల వితరణ



చిత్తూరు రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో నూతనంగా ప్రారంభించిన 'కైలాసధామం' నిర్వహణకు రూ.2లక్షలను టీడీపీ నేత చంద్రప్రకాష్ శుక్రవారం వితరణ చేశారు. ఎమ్మెల్యే జగన్మోహన్ ద్వారా ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను నిర్వాహకులకు అందజేశారు.

వేరుశనగ విత్తనకాయల పంపిణీ

గంగాధరనెల్లూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నెల్లేపల్లె సచివాలయం వద్ద శుక్రవారం పలువురు రైతులకు వేరుశనగ విత్తనకాయల బస్తాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, సర్పంచ్ గంగయ్య యాదవ్, టీఎన్‌టీయూసీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజులునాయుడు, మాజీ సర్పంచ్ పుష్పరాజ్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి మనోజ్ పాల్గొన్నారు.

పెనుమూరు: రైతు సేవా కేంద్రంలో రైతులకు వేరుశనగ విత్తనకాయల బస్తాలను పంపిణీ చేశారు. ఏవో శ్రీనివాస్, వీఏఏ డిల్లీబాబు, మండల టీడీపీ అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, పరమేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసచౌదరి, రైతులు పాల్గొన్నారు.

అమరరాజాలో పర్యావరణ దినోత్సవం



చిత్తూరు అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని అమరరాజా పరిశ్రమలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ కార్య నిర్వాహక అధికారి నరసింహులు నాయుడు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆపరేషన్ ఇండస్ట్రీస్, బ్యాటరీస్ డివిజన్ హెడ్ శ్రీనివాసరావు, ఆటోమేటివ్ బ్యాటరీస్ డివిజన్ హెడ్ మునీశ్వర నాయుడు అతిథులుగా హాజరయ్యారు. నూనెగుండ్లపల్లె, కరకంబాడిలో ఉన్న ప్లాంట్లలో 500 మొక్కలను ఉద్యోగులతో నాటించారు.

యోగాతో మానసికోల్లాసం

పెనుమూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసికోల్లాసం కల్గుతుందని రామకృష్ణాపురం మహిళా పోలీసు అఫ్రీన్ తెలిపారు. కిశోరి వికాశం శిక్షణ తరగతుల్లో భాగంగా చిప్పరపల్లెలో 18 ఏళ్లలోపు ఆడపిల్లలకు శుక్రవారం ఆమె శిక్షణ ఇచ్చారు. ఆశా, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.